క్లుప్తంగా

నేడు 'వీఎంసీ' స్పందన

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ ఆధ్వర్యాన ప్రతివారం జరిగే స్పందనలో నగర వాసులు తమ ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం జరుగుతుందని, వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో, సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు నగరవాసుల నుంచి ఫిర్యాదులు, అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

దాహార్తి తీర్చేందుకు..



భవానీపురం(విజయవాడపశ్చిమ): బాటసారుల దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాటు చేసే చలివేంద్రాలు దోహద పడతాయని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ అన్నారు. సిప్ అబాకస్ క్రియేటివ్ మైండ్ సెంటర్ సౌజన్యంతో 40, 41, 42 డివిజన్ల సీపీఎం కమిటీల ఆధ్వర్యాన భవానీపురం క్రాంబ్వే రోడ్డులోని పుచ్చలపల్లి సుందరయ్య గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన సిప్ అబాకస్ నిర్వాహకులు మధుసూదనరావు, షర్మిలతో కలిసి ప్రారంభించారు. సీపీఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, నేతలు ఎస్ సుబ్బారెడ్డి, అచ్చేశ్వరరావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి పాండురంగడి బ్రహ్మోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ శేషయ్య వీధిలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని రుక్మాబాయి సమేత పాండురంగస్వామి దేవస్థానంలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ పదకొండో వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు గొల్లపూడి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న తిరుమంజనం, 28న తిరుకల్యాణోత్సవం, సాయంత్రం సహస్ర దీపాలంకరణ, 29వ తేదీన స్వామి వారికి పుష్పయాగం తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇతర ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు.

ఆంధ్రరత్న పార్కు సుందరీకరణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని ఆంధ్రరత్న పార్కు సుందరీకరణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానికులకు సౌకర్యవంతంగా, చక్కటి ఆహ్లాదాన్ని అందించేలా పార్కు ఆధునీకరించడానికి స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి కౌన్సిల్‌లో ప్రతిపాదనలు చేశారు. గత నెలలో రూ. 16.62 లక్షల నిధులతో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శంకుస్థాపన చేశారు. సంబంధిత పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో ఆదివారం నుంచి పనులు చేపట్టారు. వీటిని పర్యవేక్షించిన కార్పొరేటర్ ప్రహరీ నిర్మాణానికి కాంక్రీట్ వేసి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజూ పిల్లలు, సందర్శకులతో పాటు వాకింగ్ కోసం వచ్చే వారికి మరింత సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేసేందుకు పార్కు ఆధునీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పార్కులో మరమ్మతులకు గురైన ఆటపరికరాలు, పార్కు ప్రహరీ, పచ్చదనం, విశాలమైన వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నాదెండ్ల రవిశంకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాలిక వెంట పడి వేధిస్తున్న యువకుడిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వించిపేట షాహీమసీదు ప్రాంతానికి చెందిన దంపతులకు ఇద్దరు సంతానం. కుమార్తె(14) మొహమ్మద్ ఆలీ పురం స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. బాలిక వెంట జాఫర్ ఆలీ అనే యువకుడు వెంట పడి వేధిస్తుండటంతో పెద్దలకు చెప్పారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో జాఫర్ ఆలీ బాలిక ఇంటి తలుపులు తీయడంతో తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు కేకలు వేశారు. దీనిపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బెదిరింపుల కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆస్తి కోసం బాబాయి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా చంపుతానని బెదిరించిన యువకుడిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టేనర్‌పేట టీఎంహెచ్ స్కూల్ ప్రాంతానికి చెందిన బరిగె వెంకట సుబ్బారావు కుటుంబం నివసిస్తోంది. సుబ్బారావు తల్లిదండ్రులకు నలుగురు సంతానం. కొంత కాలంగా సుబ్బారావు అన్నతో ఆస్తి గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అన్న కొడుకైన సాయి శనివారం రాత్రి 11 గంటల సమయంలో బాబాయి ఇంటిలోకి ప్రవేశించి గొడవ పడ్డాడు.
ఆస్తిలో వాటా ఇవ్వకపోతే చంపుతానని బెదిరింపులకు దిగడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేశారు.

వేగంగా అభివృద్ధి పనులు

- ఊర్మిళా సుబ్బారావునగర్‌లో..
- రూ.1.40 కోట్లతో అవుట్‌ఫాల్ డ్రెయిన్
- అంతర్గత రోడ్లలో సైడు కాల్వల ఏర్పాటు
- అమృత్ పథకంలో వాటర్ పైప్‌లైన్లు



ఊర్మిళానగర్ మెయిన్ రోడ్డులో జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 43వ డివిజన్ ఊర్మిళా సుబ్బారావునగర్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వర్షం కురిస్తే మెయిన్ రోడ్డుతో పాటు అంతర్గత రోడ్లలో కూడా మోకాలి లోతు ఎత్తులో నీరు నిలిచేది. మూడేళ్ల క్రితం వరకు అభివృద్ధికి నోచుకోని ఈ డివిజన్ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఊర్మిళా సుబ్బారావునగర్ మెయిన్ రోడ్డు (భవానీపురం చర్చి సెంటర్ నుంచి చివరి వరకు)కు ఎడమ వైపు అవుట్‌ఫాల్ డ్రెయిన్ లేక పోవడంతో వాన నీరు రోడ్డుపై నిలిపోతుండటంతో చాలా అవస్థలు పడ్డామని స్థానికులు చెబుతున్నారు. మెయిన్ రోడ్డులో ఉన్న హైస్కూల్, ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థుల రాకపోకల పరిస్థితి దయనీయంగా ఉండేదని వాపోతున్నారు. ఇక్కడ అవుట్‌ఫాల్ డ్రెయిన్ కోసం కొన్నేళ్ల నుంచి కలలు కంటున్న ఏకలవ్యనగర్, నులకపేట, కనకదుర్గరెడ్డి కాలనీ, ప్రజాశక్తినగర్ ప్రాంతాల ప్రజల కల అతిత్వరలోనే సాకారం కానుంది.

అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణ పనులు

ఊర్మిళా సుబ్బారావునగర్ మెయిన్ రోడ్డుకు కుడి వైపు అవుట్‌ఫాల్ డ్రెయిన్ ఉంది. అయితే ఎడమ వైపు లేకపోవడంతో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఈ నేపథ్యంలో స్థానికులు 43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డికి తమ ఇబ్బందులను తెలపడం, సమస్యను అవగాహన చేసుకున్న ఆయన వెంటనే స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లడం చకచకా జరిగాయి. వీటిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో మాట్లాడి నిధులు మంజూరు చేయించడం అంతే వేగంతో జరిగిపోయాయి. దీంతో రూ.1.40 కోట్ల వ్యయ అంచనాతో డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. చర్చి సెంటర్ నుంచి దాదాపు 740 మీటర్ల పొడవున రెండు మీటర్ల వెడల్పుతో డ్రెయిన్ నిర్మిస్తున్నారు.

అంతర్గత రోడ్లు, సైడు కాల్వల నిర్మాణం

అవుట్‌ఫాల్ డ్రెయిన్‌తోపాటు, డివిజన్‌లో అంతర్గత రోడ్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగానే ముందు సైడు కాల్వల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. డివిజన్‌లో సుమారు మూడు దశాబ్దాల క్రితం వేసిన తాగునీటి పైపులైన్లు తుప్పు పట్టడంతో పగిలిపోయాయి. దీంతో కలుషిత మంచినీరు వస్తోంది. స్థానికుల ఇబ్బందులు తొలగించడానికి అమృత్ పథకం కింద నూతన వాటర్ పైప్ లైన్ల ఏర్పాటు పనులుకూడా జరుగుతున్నాయి. డివిజన్‌లో వరుసగా జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి స్థానికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



అంతర్గత రోడ్లలో సైడ్ కాల్వల నిర్మాణం

మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సహకారంతో డివిజన్‌ను నియోజకవర్గంలో మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతా. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్‌లో సుమారు రూ.25 కోట్ల మేర అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులు వర్షాకాలం వచ్చేలోపు పూర్తికావాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం. అనంతరం మెయిన్ రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెడతాం.

– బాపతి కోటిరెడ్డి, 43వ డివిజన్ కార్పొరేటర్

పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 45వ డివిజన్‌లో ఆదివారం పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీన్ని కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య పర్యవేక్షించారు. సైడు కాలువలను శుభ్రం చేయించడంతోపాటు వీధుల్లో చెత్త లేకుండా ఊడ్పించారు. పూడికలు తీయించారు. కార్పొరేటర్ మాధురి లావణ్య ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. బాస్కెట్ కలెక్షన్ కోసం శానిటరీ సిబ్బంది రోజూ వస్తున్నారని చెత్తను కాల్వల్లో, ఖాళీ స్థలాల్లో పడేయడం సరి కాదని తెలిపారు.
ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మూడో స్థానంలో ఉన్న నగరం 2023లో మొదటి ర్యాంక్ సాధించాలంటే ప్రజా భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రతి ఆదివారం రెండు, మూడు వీధుల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి డివిజన్‌ను చెత్త రహితంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. వైఎస్సార్ సీపీ డివిజన్ బాధ్యులు మైలవరపు కృష్ణ, శానిటరీ మేస్త్రి కొండా రామిరెడ్డి పాల్గొన్నారు.



ద్వారక వీధిలో స్పెషల్‌డ్రైవ్ పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ మాధురీ లావణ్య

వర్షితప్ దీక్షల ముగింపు ఉత్సవం

- భారీగా తరలివచ్చిన జైనులు
- పాతబస్తీ జైన ఆలయాల్లో ప్రత్యేక పూజలు





దీక్షలను విరమింపజేస్తున్న కుటుంబ సభ్యులు : మాట్లాడుతున్న జైన గురువు శ్రీ అభినందన్ చంద్రసాగర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జైనులు పవిత్రంగా భావించే వర్షితప్ దీక్షల ముగింపు ఉత్సవం ఆదివారం ముగిసింది. ఏడాది కాలంగా జైన ఆచారం ప్రకారం వర్షితప్ పేరుతో కొనసాగిస్తున్న ఉపవాస దీక్షలను వారి ప్రత్యేక కార్యక్రమాల నడుమ విరమించారు. పాతబస్తీలోని శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తిపూజక్ సంఘ్ ఆధ్వర్యాన రెండు రోజుల ఉత్సవంలో భాగంగా స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో సామూహికంగా ఉపవాస దీక్షల విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షలను ఆచరించిన వారికి ప్రత్యేక సింహాసనం వంటి ఆసనాలు ఏర్పాటు చేసి వారికి చెరుకు రసాన్ని అందించారు. కార్యక్రమంలో వారి బంధువులు భారీగా తరలిరావడంతో లోపలకు వెళ్లడానికి ప్రత్యేక పాస్‌లను జారీ చేసి.. వారిని మాత్రమే అనుమతించారు. సంఘ్ అధికార ప్రతినిధి ప్రవీణ్ రాంకా మాట్లాడుతూ జైన సంప్రదాయంలో పలు సందర్భాల్లో ఉపవాసదీక్షలను ఆచరిస్తారన్నారు. ఆ క్రమంలో వర్షితప్ చాలా గొప్ప దీక్షగా తమ పెద్దలు చెబుతారన్నారు. రెండో రోజు ఉత్సవానికి పదిహేను వేల మంది జైనులు హాజరైనట్లు వివరించారు.

సమాజానికి జైన ధర్మం అవసరం

ప్రస్తుత సమాజానికి జైన ధర్మం చాలా అవసరమని ప్రముఖ జైనగురువు పరమపూజ్య అభినందన్ చంద్రసాగర్ అన్నారు. ఆదివారం సాయంత్రం జరిగిన ప్రవచన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో శాంతి వర్ధిల్లాలంటే జైన మత ధర్మాన్ని అనుసరించడం చాలా అవసరమన్నారు. జైనంలో ఉపవాసానికి చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. విజయవాడ వంటి నగరంలో వందలాది మంది దీక్షను ఆచరించడం ఆనందాన్ని కలిగించిందన్నారు. నిర్వాహకులను అభినందించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పాతబస్తీలోని జైన ఆలయాల్లో అక్షయతృతీయ పురస్కరించుకొని వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. వట్టూరి వారి వీధిలోని మందిరంలో జైన ప్రథమ తీర్థంకురుడు ఆదినాథ్‌ప్రభుజీ విగ్రహానికి చెరుకురసంతో అభిషేకాలు చేశారు. సంస్థ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ బోడోతరియా, ప్రధాన కార్యదర్శి పన్నాలాల్ జైన్ ఉపాధ్యక్షులు అశోక్ జైన్, జయంతిలాల్ జైన్, సహాయక కార్యదర్శి భోగిలాల్ జైన్, కోశాధికారి డుంగరమల్ జైన్, సహ కోశాధికారి రాహుల్ జైన్ పర్యవేక్షించారు.

కళాకారుల సంక్షేమానికి కృషి

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడ కల్చరల్: కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కళాతపస్వి కళాపీఠం సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహించిన తొలి కార్యక్రమం, కళాకారుల సత్కారాన్ని మల్లాది విష్ణు ప్రకాశం రోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం ప్రారంభించారు. లోగోను ఆవిష్కరించిన తర్వాత విష్ణు మాట్లాడుతూ కళాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. కళాతపస్వి పేరుతో స్థాపించిన సంస్థ విశ్వనాథ్ ఆశయాలకు అనుగుణంగా నిర్వహించాలని చెప్పారు. సంస్థ నిర్వహించే కార్యక్రమాలకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని హామీ నిచ్చారు. సభాధ్యక్షుడు ద్విశతావధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ మాట్లాడుతూ విశ్వనాథ్ సినిమాలు ప్రగతికి సంకేతాలన్నారు. తెలుగువారి కీర్తి పతాకను విదేశాల్లో ఎగరేసిన కళాతపస్వి సేవలను నిర్వాహకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సంస్థ కన్వీనర్ చతుర్వేదల శ్రీనివాస్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా కార్యక్రమాలను నిర్వహిస్తామని కళాకారులను గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. కార్పొరేటర్ శర్వాణీ మూర్తి, కళాతపస్వి కళాపీఠం మరో కన్వీనర్ క్రొవ్విడి సత్యనీలా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. నాట్యాచార్యుడు చామర్తి వెంకట పూర్ణయ్యను నిర్వాహకులు.. మల్లాది విష్ణు, శర్వాణీ మూర్తి చేతుల మీదుగా సత్కరించారు.



చామర్తి వెంకట పూర్ణయ్య సత్కారంలో మల్లాది విష్ణు, శర్వాణీ మూర్తి తదితరులు

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది



పుస్తకాలను ఎంపిక చేసుకుంటున్న సందర్శకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ అన్నారు. ఆదివారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో పుస్తక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. జమల పూర్ణమ్మ మాట్లాడుతూ పుస్తకం ప్రియనేస్తమని పేర్కొన్నారు. పుస్తకాలు దారి చూపే దివ్వెలని, అటువంటి పుస్తకాలను పఠనం చేసి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తకం విలువ తెలియజెప్పడం, పుస్తకాల పట్ల అభిలాషను పెంచేందుకు 1995 నుంచి ఏటా 'ప్రపంచ పుస్తక దినోత్సవం' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి, వై.ధనలక్ష్మి, కె.రాంబాబు, గోపాలరావు, దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పుస్తక పంపిణీకి విశేష స్పందన

పటమట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఏపీ గ్రంథాలయ సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద తెలిపారు. గ్రంథాలయ సంఘం ఆధ్వర్యాన విజయవాడ సర్వోత్తమ భవనంలో ఉచిత పుస్తక పంపిణీ జరుగుతోంది. కార్యక్రమంలో రెండో రోజు ఆదివారం అనూహ్య స్పందన వచ్చిందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, వృద్ధులు, మహిళలు, బాల బాలికలు తమకు నచ్చిన పుస్తకాలను తీసుకెళ్లారన్నారు. నగర పౌరులేకాక, సమీపంలోని గన్నవరం, మంగళగిరి, గుడివాడ, పామర్రు, తెనాలి తదితర ప్రాంతాల నుంచి వచ్చి పుస్తకాలు తీసుకెళ్లారని, పుస్తక పంపిణీకి పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో వచ్చే ఏడాది నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తామని ప్రకటించారు. పుస్తకాల పంపిణీకి పలువురు జిల్లా స్థాయి అధికారులు, న్యాయ, పోలీసు, పోస్టల్ తదితర శాఖల ఉన్నతోద్యోగులు కుటుంబ సభ్యులతో వచ్చి పుస్తకాలను తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఆదివారం 13 వేల మందికి పైగా విచ్చేసి 38 వేలకు పుస్తకాలు తీసుకెళ్లారని, వీటిలో కూడా ఎక్కువ భాగం మెడికల్, ఇంజినీరింగ్, విద్యార్థులు స్టడీ మెటీరియల్స్, పోటీ పరీక్షల పుస్తకాలు, బాల సాహిత్యం, మతాలూ, సాహిత్య గ్రంథాలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

ఘనంగా శ్యామశాస్త్రి జయంతి



శ్యామశాస్త్రి కీర్తనలను గానం చేస్తున్న అంజనా సుధాకర్, మల్లాది కార్తీక త్రివేణి తదితరులు

విజయవాడ కల్చరల్: కర్ణాటక సంగీత త్రిమూర్తుల్లో ఒకరైన శ్యామశాస్త్రి జయంతి వేడుకలను ఆదివారం శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యాన సత్యనారాయణపురంలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, మల్లాది కార్తీక త్రివేణి, విశ్వనాథ్, లయ విద్వాంసులు కార్తికేయ ఆదినారాయణ, సుబ్బరాయ ఫల్గుణ్, సద్గురు చరణ్, యువ సంగీత కళాకారులు, సుబ్రహ్మణ్య సంగీత సమితి విద్యార్థులు శ్యామశాస్త్రి కీర్తనలను మధురంగా ఆలపించారు. ఆకాశవాణి టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ మోదుమూడి సుధాకర్.. కర్ణాటక సంగీతానికి శ్యామశాస్త్రి చేసిన సేవలను వివరించారు. సంగీత సమితి నిర్వాహకులు చిట్టా విశ్వేశ్వరరావు, రామలక్ష్మి పాల్గొన్నారు.

ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి



పరీక్షలు చేస్తున్న డాక్టర్లు ఎస్వీకే ప్రసాద్, కోనా వీరబ్రహ్మం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎండలు పెరుగుతుండటంతో ప్రతి ఒక్కరూ ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవాలని ఆయుర్వేద వైద్యనిపుణులు ఎస్వీకే ప్రసాద్, హోమియోపతి వైద్యులు కోనా వీరబ్రహ్మం సూచించారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం జరిగింది. వారు మాట్లాడుతూ ఎండల్లో సాధ్యమైనంత వరకు తిరగకూడదని ఒక వేళ అత్యవసరమైతే చెవి, ముక్కు నోటికి రక్షణగా కప్పుకుని బయటకు వెళ్లాలన్నారు. సీజనల్ పండ్లు అధికంగా తీసుకోవటంతో పాటు తాటి ముంజలు, బీర, దోస, సొరకాయ వంటి కూరగాయలను తీసుకోవాలన్నారు. అనంతరం ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సుమారు 250 మందికి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రభొట్ల ఆదిత్య, ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ పాల్గొన్నారు.

అలరించిన నాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఖమ్మానికి చెందిన అభినయ రుద్ర నాట్యాలయానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. ధర్మపథం కార్యక్రమంలో ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై పలువురు కళాకారులు భరత నాట్య ప్రదర్శన ఇచ్చారు.
సుమారు 20 మంది నృత్య ప్రదర్శన చేశారు. కళా ప్రదర్శన అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: మీనాక్షి కల్చరల్ అకాడమీ, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో సినీ నటుడు ఎన్టీఆర్ శతజయంతి వేడుకల సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళా వేదికపై నిర్వహించిన శతజయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి అలరించింది. బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్‌గా అభివర్ణించారు. తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ సంస్థ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ డేవిడ్ రాజు, శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు. మీనాక్షి కల్చరల్ అకాడమీ నిర్వాహకుడు మధుమోహన్ ఆధ్వర్యాన గాయకులు తెలుగు పాటలు ఆలపించారు.

భక్తిశ్రద్ధలతో నరసింహస్వామి మహా యజ్ఞం



యజ్ఞం చేస్తున్న దయానిధి దాసన్ గురూజీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): అక్షయ తృతీయ సందర్భంగా లోక కల్యాణార్థం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శ్రీజగన్నాథ మందిరంలో ఆదివారం నరసింహస్వామి మహాయజ్ఞం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీమాన్ దయానిధి దాసన్ గురూజీ యజ్ఞంలో పాల్గొన్నారు. యజ్ఞయాగాదులతో రాష్ట్రం పాడి పంటలతో సుభిక్షంగా ఉంటుందని దాసన్ గురూజీ తెలిపారు. నేటి యువత ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ముదావహమన్నారు.

బసవేశ్వరస్వామి జయంతి



కృష్ణలంక(విజయవాడతూర్పు): నల్లగేటు సెంటర్‌లో కర్ణ భక్త సంక్షేమ సంఘం ఆధ్వర్యాన విశ్వగురు బసవేశ్వర స్వామి 887వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు.. బసవేశ్వర స్వామి చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. . కార్యక్రమంలో కర్ణ భక్త సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు వాసా పల్లపరాజు, ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల నాగరాజు, కోశాధికారి తాళ్ల మోహన్‌కృష్ణ, నగర అధ్యక్షుడు గుడిమెట్ల శివయ్య, ఎస్.నాగేశ్వరరావు, అల్లం సాయిబాబా, కొలను కొండ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సహాయ, సహకారాలు అందిస్తా

ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ గౌతంరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నాక్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ యూనియన్‌కు సహాయ, సహకారాలు అందజేస్తానని యూనియన్ గౌరవ సలహాదారు, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఎస్వీఎస్ రెడ్డి ఫంక్షన్ హాలులో నాక్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ యూనియన్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ యూనియన్‌కు అన్ని రకాలుగా అండదండలు అందిస్తానన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. యూనియన్ ప్రతినిధులు తమ సమస్యలను గౌతంరెడ్డికి వివరించారు. సమావేశం అనంతరం యూనియన్ కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు జి. శంకరయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, కోశాధికారి డి.కిరణ్‌కుమార్‌రెడ్డి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఫౌంటెన్ కాదు..పైపులైన్ లీకేజీ...!



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భవానీపురం హెడ్ వాటర్ వర్క్స్ ఎదురుగా కొండపై ఆదివారం ఒక్కసారిగా వాటర్ ఫౌంటెన్ దర్శనమిచ్చింది. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులతో పాటు దుర్గగుడి ఫ్లై ఓవర్ పైనుంచి వెళ్లే ప్రయాణికులు దీన్ని చూశారు. అయితే అది వాటర్ ఫౌంటెన్ కాదని, మంచినీటి పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీ అని కొంత సమయం తర్వాత తెలిసింది. హెడ్ వాటర్ వర్క్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేశారు. అక్కడ ఏర్పాటుచేసిన పైప్‌లైన్ లీకవడంతో ఆ తర్వాత కార్పొరేషన్ సిబ్బంది నీరు బయటకు రాకుండా చర్యలు తీసుకున్నారు.